నేడు మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం

యాచారం, సెప్టెంబర్29: మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని సోమవారం మండల కేంద్రంలోని సాయి శరణం ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం 1గంటకు నిర్వహించనున్నట్లు ఎంఈవో పాండురంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

యాచారం, సెప్టెంబర్29: మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సర్వసభ్య సమావేశాన్ని సోమవారం చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11గంటలకు పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ముఖ్య కార్యనిర్వాహణ అధికారి (సీఈవో) నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండలంలోని డైరెక్టర్లు, రైతులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

నేడు బాటసింగారం రైతు సేవా

సహకార సంఘం..

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 29 : బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని సంఘం ఆవరణలో సోమవారం ఉదయం 11.30 గంటలకు సంఘం అధ్యక్షుడు చేగూరి భరత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మేనేజర్ జక్కుల ఐలేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 01.03.2024 నుంచి 31.08.2024 వరకు సంఘం వ్యవహారాలు, జమాఖర్చులపై నివేదిక సమర్పన, 2023-2024 ఆర్థిక సంఘం ఆడిట్ రిపోర్టు ఆమోదం, పాలకవర్గ తీర్మానం ప్రకారం 31.03.2024 ఒక సంవత్సరం రైతుల వాటాదనంపై 6శాతం డివిడెంట్ ఇవ్వడంపై సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులు, రైతులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

దసరాకు ఆలయాలు ముస్తాబు

దేవీశరన్నవరాత్రులకు ఏర్పాట్లు ముమ్మరం



ముస్తాబవుతున్న మైసిగండి గ్రామంలోని శివాలయం, రామాలయాలు

కడ్తాల్, సెప్టెంబర్ 29 : రంగారెడ్డి జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో కొలువుదీరిన మైసమ్మ దేవత, శివాలయ, రామాలయాల్లో దసరా దేవీశరన్నవరాత్రుల మహోత్సవాలకు ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. అక్టోబర్ 3 నుంచి 12 వరకు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే శరన్నవరాత్రుల ఉత్సవాలకు ఆలయ సిబ్బంది, నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణేశ్వరి అమ్మవారు ప్రతి రోజూ ఒక్కో దివ్య అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ఆలయాలను వివిధ రకాల పూలు, తోరణాలు, విద్యుత్‌దీపాలతో అందంగా ముస్తాబు చేస్తున్నారు. ఆలయం ముందు ఉన్న కోనేరు భక్తులను ఆకట్టుకుంటున్నది. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శిరోలిపం తూనాయక్, ఈవో స్నేహలత తెలిపారు.

రోజుకో అలంకారంలో..

శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఈ నెల 3న శ్రీఅన్నపూర్ణేశ్వరీదేవి అలంకారంలో, 4న శ్రీబాలాత్రిపుర సుందరిదేవిగా, 5న శ్రీగాయత్రీదేవిగా, 6న భవానీ దేవిగా, 7న శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా, 8న శ్రీమహాలక్ష్మీదేవిగా, 9న శ్రీసరస్వతీదేవిగా, 10న దుర్గాదేవిగా, 11న ఉదయం మహిషాసుర మర్దనిగా, 12న శ్రీరాజరాజేశ్వరీదేవి (విజయ దశ మి రోజు)గా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఉత్సవాలకు రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాలకు చెందిన భక్తులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

జయప్రదం చేయాలి..

దసరా శరన్నరాత్రుల ఉత్సవాలకు ఆలయాలను శోభాయమానంగా ముస్తాబు చేస్తున్నాం. పది రోజులపాటు నిర్వహించే దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ఆవరణలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతులు, సదుపాయాలు కల్పిస్తాం. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలి.

– శిరోలిపంతూనాయక్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, మైసిగండి ఆలయం

అన్ని వసతులు కల్పిస్తాం..

మైసిగండి గ్రామంలోని రామాలయ, శివాలయాల్లో శరన్నవరాత్రుల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయం లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఉత్సవాలకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా ఆల య ఆవరణలో అన్ని వసతులు కల్పిస్తాం. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

–స్నేహలత, ఈవో, మైసిగండి మైసమ్మ ఆలయాలు

3 నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 29 : వచ్చే నెల 3 నుంచి 12వరకు మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని అందంగా ముస్తాబు చేస్తున్నారు. గురువారం ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకంతో పూజలు ప్రారంభం కానున్నాయి. చివరి రోజు 12న ఉదయం అభిషేకం, రాత్రి 8గంటలకు శమీపూజ ఉంటుందని దేవస్థానం మేనేజర్ నరేందర్, ధర్మకర్త దేవుని వామానాచారి, పూజారి కన్నా చారి తెలిపారు. ఈ పూజ కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదములు స్వీకరించి .. స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు. అదే విధంగా ప్రతి రోజూ గ్రామ భక్తుల చేత దేవాలయంలో 7గంటలకు విష్ణు సహస్రనామ పారాయనం, సహస్ర దీపాలంకరణ ఉంటుందని తెలిపారు.

రంగారెడ్డి జిల్లా ఓటర్ల జాబితా..

మండలాల వారీగా ఓటర్ల జాబితా ..

మండలం పేరు	పురుషులు	స్త్రీలు	ఇతరులు..
అబ్దుల్లాపూర్‌మెట్	17548	17597	4
ఆమనగల్లు	7247	7160	0
చేవెళ్ల	29200	29097	2
ఫారూఖ్‌నగర్	24883	24997	3
ఇబ్రహీంపట్నం	15378	15558	2
చౌదర్‌గూడ	12659	12386	4
కడ్తాల్	17214	18013	1
కందుకూరు	25577	25191	1
కేశంపేట	17848	18013	1
కొందుర్గు	11489	11705	0
కొత్తూరు	8162	8019	1
మాడ్గుల	22488	21563	0
మహేశ్వరం	21591	21438	0
మంచాల	20337	19656	1
మొయినాబాద్	30613	29880	2
నందిగామ	13409	13460	2
షాబాద్	24313	23740	1
శంషాబాద్	16314	16516	1
శంకర్‌పల్లి	20086	20314	1
తలకొండపల్లి	18807	18357	1
యాచారం	24241	24253	1

రంగారెడ్డి జిల్లాలోని 549 గ్రామపంచాయతీలకు సంబంధించిన ఓటరు జాబితాను వార్డులవారీగా ఇటీవల ఎన్నికల సంఘం విడుదల చేసింది. కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు ఆ ఓటరు జాబితాను ఆయా గ్రామపంచాయతీలో పెట్టారు. జిల్లాలో 7,94,651 ఓటర్లకు గానూ పురుషులు 3,99,404, స్త్రీలు 3,95,214, ఇతరులు 33 మంది ఓటర్లు ఉన్నారు.

– ఇబ్రహీంపట్నం రూరల్, సెప్టెంబర్ 29

మౌలిక వసతులకు పెద్దపీట

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్‌చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి, కౌన్సిలర్ సుజాత

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 29: వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని 21వ వార్డు పరిధి, కుంట్లూరులోని శ్రీలక్ష్మీనగర్ కాలనీ నుంచి బృందావన్‌నగర్ కాలనీ వరకు రూ.16 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక కౌన్సిలర్ ఓరుగంటి సుజాతతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. బృందావన్ కాలనీలోని పార్కుల్లో కాంపౌండ్ వాల్ ఫెన్సింగ్ ఏర్పాటు పనులు, రెండు కాలనీల కోసం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంపూర్ణారెడ్డి మాట్లాడుతూ.. పనులను నాణ్యతగా చేపట్టాలన్నారు.

కార్యక్రమంలో కేసారం బాల్‌రెడ్డి, విజయ్ శేఖర్‌రెడ్డి, ఓరుగంటి కొండల్‌గౌడ్, జోర్క శ్రీరాములు, బద్దం శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎండీ సయ్యద్, శంకర్‌యాదవ్, లక్ష్మీనగర్ కాలనీ ప్రెసిడెంట్ జగన్ ప్రసాద్, బృందావన్ కాలనీ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలి

షాబాద్ మండల పరిధి , చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని, ప్రతి రోజూ వ్యాయామం, నడక తప్పనిసరి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చందనవెల్లి పీహెచ్‌సీ వైద్యురాలు స్వర్ణలత, వైద్య సిబ్బంది నవీన్, మల్లేశ్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు , తదితరులు పాల్గొన్నారు.

– చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 29

కొండకల్‌లో సభ్యత్వ నమోదు

శంకర్‌పల్లి మండల పరిధి, కొండకల్, కొండకల్ తండాలో బీజేపీ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ పార్టీ సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములు గౌడ్, నాయకులు రాజచంద్ర, వెంకటేశ్, కొండకల్ గ్రామ బూత్ లెవల్ ఇన్‌చార్జిలు బద్దం రాంరెడ్డి, మైసయ్య, అశోక్, రాజు, శ్రీకాంత్, వినయ్, మల్లేశ్, నర్సింహులు పాల్గొన్నారు.

–చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 29

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్.. గంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు

ఊరెళ్ల రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, తదితరులు

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 29 : గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని చేవెళ్ల మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్ అన్నారు. గతంలో కురిసిన వర్షాలకు ఊరెళ్ల టు చేవెళ్ల రోడ్డు గుంతలయమంగా తయారవ్వడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్ స్పందించి ఆదివారం స్థానిక నాయకులతో కలిసి రోడ్డుకు మరమ్మతులు చేయించారు. జేసీబీతో గుంతల్లో మట్టిని పోయించి చదును చేయించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ముందుంటానని, అభివృద్ధిలో గ్రామ పెద్దలు, యువకులు పాలు పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జహాం గీర్, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూ కల్తీ చేసిన వారిని శిక్షించాలి

ఆమనగల్లులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాలు

ఆమనగల్లు, సెప్టెంబర్ 29 : కలియుగ దైవం, హిందువులు అత్యంత పవిత్రంగా భావించే తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ మహాప్రసాదాన్ని కల్తీ చేయడం సరైన విధానం కాదని.. ఈ ఘటనకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు మాండన్ శ్రీకాంత్‌సింగ్ డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ ఆదివారం ఆమనగల్లు పట్టణంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం శ్రీకాంత్‌సింగ్ మాట్లాడుతూ .. హిందువుల మనోభావాలు కించపరిచే విధంగా చేసిన నాటి టీటీడీ ధర్మకర్త , నాటి సీఎం జగన్‌తో పాటు నిందితులందరిపై విచారణ జరిపి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యాక్రమంలో పాపిశెట్టి రాము, ఆర్ఎస్ఎస్ నాయకులు అంజయ్య, విశ్వనాథం, ఆనంద్, తిరుపతి, మాధవచారి, మనోహర్, నిరంజన్, నర్సింహ, ఎర్రవోలు మహేశ్, ఏబీవీపీ నాయకులు మల్లేశ్, బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు శేఖర్, లక్ష్మణ్, కృష్ణ, సీనియర్ నాయకులు గోరటి నర్సింహ, శ్రీను, ఆనంద్, మహేశ్, ధోని పాల్గొన్నారు.

మురుగుకుంటతో ఇబ్బందులు

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 29: నివాసాల ముందున్న మురుగుకుంటతో భరించలేని దుర్వాసన వస్తున్నదని స్థానికులు వాపోతున్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చటాన్‌పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఎగువ ప్రాంతాల నుంచే వచ్చే మురుగునీరంతా ఒకే దగ్గర చేరి మురుగుకుంటగా మారిందని, దీంతో భరించలేని దుర్వాసన వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటితో దోమలు, ఈగలు అధికమై రాత్రి సమయాల్లో నిద్ర కూడా పోవడంలేదన్నారు. ఎగువ ప్రాంతాల నుంచే వచ్చే మురుగునీరు దిగువ ప్రాంతాలకు వెళ్లే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

1997-98 సంవత్సరంలో చన్‌వెల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు దాదాపు 26 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను ఆహ్వానించి.. జ్ఞాపికలు అందజేసి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

– చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 29

ఇబ్రహీంపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరం పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహితులంతా ఒక్కచోటచేరి.. తమ చిన్నచాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా సరదాగా ఆడుతూ.. పాడుతూ సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా గురువులను సత్కరించారు.

– ఇబ్రహీంపట్నంరూరల్, సెప్టెంబర్ 29

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదిబట్ల, సెప్టెంబర్ 29: పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం .. స్టేషన్ పరిధి, వండర్ల సమీపంలోని రావిరాల గ్రామ పరిధిలో దొడ్డి కుమార్, రావుల జంగయ్య, కోటగల్ల రఘు, ధర కుమార్, బొల్లా హరికృష్ణలు పేకాట ఆడుతున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు పేకాట స్థావరంపై దాడిచేసి.. ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 13,720 నగదుతో పాటు 4 సెల్ ఫోన్లను స్వాధీనం చేకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి చొరవ

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 29 : రైతు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్, మల్కారం పీఏసీఎస్ చైర్మన్ బుర్కుంట సతీశ్ తెలిపారు. ఆదివారం శంషాబాద్ మండలం మల్కారం పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మల్కారం సహకార సంఘం ఇప్పటికే రూ. 19 కోట్ల టర్నోవర్ దాటిందని తెలిపారు. సంఘం పరిధిలోని రైతులంతా స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. రైతులకు బంగారు ఆభరణాలపై రుణాలు, అవసరమైన వారికి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. బ్యాంకింగ్ సౌకర్యం, లాకర్ సదుపాయాలు ఉన్నట్లు తెలిపారు.

గడ్డిఅన్నారం వ్యవసాయ(పండ్ల) మార్కెట్ నూతన కమిటీ నియామకానికి కృషి చేసిన మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ ప్రచారకమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాస్కీగౌడ్, ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మందుముల పరమేశ్వర్‌రెడ్డిలను ఆదివారం ఉదయం వారివారి నివాసాల్లో నూతన చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ చౌదరిమెట్టు భాస్కరచారిలు పాలకవర్గ సభ్యులతో కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సన్మానించి , కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రఘుపతిరెడ్డి, నవరాజ్, అంజయ్య, మచ్ఛందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, గణేశ్‌నాయక్, వెంకట్‌గుప్తా, గోవర్ధన్‌రెడ్డి, మేకం లక్ష్మి, నరసింహ, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

– అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 29

పేదలను ఆదుకోవడమే రాధాకృష్ణ ట్రస్ట్ లక్ష్యం

మండల కేంద్రంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్

కడ్తాల్, సెప్టెంబర్ 29 : మండలంలోని పేద ప్రజలను ఆదుకోవడమే రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు లక్ష్యమని చైర్మన్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాలు, తండాల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఇటీవల సాలార్‌పూర్ గ్రామంలో కావలి చెన్నమ్మ, కర్రె శివమ్మ, సాయిలు, కడ్తాల్ గ్రామంలో సిలివేరు జంగమ్మ, చల్లంపల్లి గ్రామ పంచాయతీలోని వంపుగూడెంలో పోతుగంటి భీమయ్య, గొర్ల కిష్టయ్య వివిధ కారణాలతో మరణించారు. బాధిత కుటుంబాలను దశరథ్‌నాయక్ పరామర్శించి.. మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం రాధాకృష్ణ ట్రస్టు తరపున మృతుల కుటుంబాలకు ఐదువేల చొప్పున రూ.30వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ సర్పంచ్‌లు కృష్ణయ్యయాదవ్, హరిచంద్‌నాయక్, రజక సంఘం గ్రామాధ్యక్షుడు కృష్ణయ్య, మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, రైతు సంఘం మాజీ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు పంతూనాయక్, మహేశ్ , బాబా, చందు, వెంకటేశ్, జైపాల్, గోపాల్, నరేశ్, ప్రకాశ్, మాధవులు, కరుణాకర్, రాజు, కుమార్, రాజేందర్, శ్రీధర్, అర్జున్, రమేశ్, సాయిలు , తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ గౌడ సంఘం కార్యవర్గం

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 29 : అబ్దుల్లాపూర్‌మెట్ గౌడ సంఘం సమావేశాన్ని మండల కేంద్రంలోని గౌడ సంఘంలో ఆదివారం నిర్వహించారు. గౌడ కులపెద్దల సమక్షంలో సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డం బాలయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా నారం వెంకటేశ్‌గౌడ్, డైరెక్టర్లుగా బొడిగె రవీందర్‌గౌడ్, చెరుకు భాస్కర్‌గౌడ్, తోర్పునూరి యాదయ్యగౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, అంతటి మహేశ్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గౌడ కులపెద్దలు బుర్ర దాస్ గౌడ్, బొడిగె అశోక్‌గౌడ్, చెరుకు వెంకటేశ్‌గౌడ్, బుర్ర చంద్రంగౌడ్, బుర్ర మహేందర్‌గౌడ్, చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్, తాటిపల్లి రమేశ్ గౌడ్, తోర్పునూరి ప్రవీణ్‌గౌడ్, బొడిగె రాజేశ్‌గౌడ్, మందుగుల శ్రీశైలంగౌడ్, బొడిగె జగదీశ్‌గౌడ్, నారం బాబుగౌడ్, చెరుకు రాంగోపాల్ గౌడ్, గడ్డం దశరథగౌడ్, తోర్పునూరి జంగయ్యగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, గీత కార్మికులు, యువకులు పాల్గొన్నారు.

పనులను నాణ్యతగా చేపట్టాలి

మరమ్మతు పనులను పరిశీలిస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్

కడ్తాల్, సెప్టెంబర్ 29: మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారికి సంబంధించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను నాణ్యతగా చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ అన్నారు. ఆదివారం డ్రైనేజీ మరమ్మతు పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కడ్తాల్ పట్టణంలోని తలకొండపల్లి చౌరస్తాలో జాతీయ రహదారి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కాల్వ దెబ్బతిని రెండు గోతులు ఏర్పడ్డాయని తెలిపారు. గోతులతో వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదన్నారు. భూగర్భ కాల్వకు మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతూ, వారం రోజుల క్రితం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతు పనులు చేపట్టారని ఆయన పేర్కొన్నారు. పనులను నాణ్యతగా చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రంగయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు భిక్షపతియాదవ్, నాయకులు మహేశ్, కుమార్, శేఖర్, ఇమ్రాన్‌బాబా, తదితరులు ఉన్నారు.